క్లుప్తంగా

పోడు రైతుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే వెడ్మబొజ్జుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: పోడురైతులకు అటవీ హక్కు పత్రాలు అందించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, పోడు రైతులతో కలిసి విన్నవించారు. మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన పోడు రైతులు గత 40 ఏళ్లుగా సాగులో ఉన్నప్పటికీ ఇటీవల అటవీ అధికారులు జేసీబీలతో తవ్వకాలు చేపట్టి బాధిత రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూర్చారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రైతులకు న్యాయం జరిగేలా చూడడంతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యుడు నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, రైతు భూమన్న తదితరులు ఉన్నారు.

సినారె పురస్కారానికి ఎంపిక



డాక్టర్ దామెర రాములు

నిర్మల్‌టౌన్: మహాకవి సినారె జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ప్రకటించిన పురస్కారాలకు జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు, కవి డాక్టర్ దామెర రాములు ఎంపికయ్యారు. భువనగిరిలో ఈనెల 27న నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పురస్కారానికి ఎంపిక కావడంతో డాక్టర్ దామెర రాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు, తదితరులు ఆయన్ను అభినందించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



మాట్లాడుతున్న రాజేశ్

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ శివారులోని ప్రభుత్వ ఆసైన్డ్ భూములు కాపాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యాదర్శి రాజేశ్ కోరారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. అప్పటి తహసీల్దార్ గజానన్ కొందరికి అక్రమంగా పట్టాలిచ్చారన్నారు. సర్వే నంబర్ 13, 26, 37, 38లో గల భూములపై విచారణ చేపట్టడంతోపాటు గజానన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకుడు దుర్గం లింగన్న తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



సారంగపూర్‌లో మొరం పోస్తున్న సిబ్బంది

కడెం: మండలంలోని సారంగపూర్ గ్రామంలోని రామాలయం నుంచి దిల్దానగర్ సమీపంలోని అక్కకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం సారంగపూర్‌లో మట్టిరోడ్డుపై నుంచి మొరం పోశారు. రూ.2.45 కోట్లతో 3.5 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ రఘు తెలిపారు.

నూతన కార్యవర్గానికి సన్మానం

ఖానాపూర్: బ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం మస్కాపూర్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు సందీప్ శర్మ, ప్రధాన కార్యదర్శి అభిషేక్ శర్మ, కోశాధికారి వెంకటేశ్ శర్మలను నాయకులు సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు గిరి, భూమన్న, స్వామి, కృష్ణ, సురేశ్, శేఖర్, మహేశ్, శివ, ఉదయ్ తదితరులు ఉన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, పెంబి మండలాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభిస్తారని కాంగ్రెస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ మండలం రాజురా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభోత్సవంతోపాటు కడెం మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పెంబి తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు.

కుంటాల దవాఖానకు సుస్తీ..!



మూసిఉన్న కుంటాలలోని పీహెచ్‌సీ

- రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు
- మందుల కొరత
- రోగులకు అందని వైద్య సేవలు

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం వైద్యశాలలు ఏర్పాటు చేస్తోంది. దవాఖానాల్లో నెలకొన్న సమస్యలు, సిబ్బంది, మందుల కొరత కారణంగా పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఏళ్లుగా పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రోగులు ఇక్కడి నుంచి నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

'రెండేళ్లుగా సా..గుతున్న పనులు

స్థానిక పీహెచ్‌సీ భవనాన్ని గత 25 ఏళ్ల క్రితం నాసిరకంగా నిర్మించడంతో శిథిలావస్థ దశకు చేరుకుంది. వైద్యశాల మరమ్మతు కోసం ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.19.50 లక్షలు వెచ్చించారు. రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేసిన ఇప్పటికి పనులు పూర్తి కాలేదు. దీంతో పక్కనే ఉన్న ప్రసూతి కేంద్రంలో ఇబ్బందులు పడుతూ సిబ్బంది రోగులకు సేవలందిస్తున్నారు.



ప్రసూతి కేంద్రంలోని సేవలందిస్తున్న సిబ్బంది

15 పంచాయతీల్లోని 16 రెవెన్యూ గ్రామాలు ఉండగా, కుంటాలలో వైద్యశాల ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలలో ఆరు బెడ్లు ఏర్పాటు చేయించి రోగులకు వైద్యం అందిస్తున్నారు.

సిబ్బంది కొరతే..

స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. మరో వైద్యురాలిని డిప్యూటేషన్‌పై నిర్మల్‌లోని రాంనగర్ వైద్యశాలకు పంపారు. ల్యాబ్ టెక్నీషియన్ ఖాళీగా ఉండడంతో వారానికి మూడు రోజులపాటు ముథోల్ వైద్యశాల నుంచి వచ్చినా సరైన సమయంలో సేవలందడం లేదని రోగులు పేర్కొంటున్నారు. మగ హెల్త్ సూపర్‌వైజర్‌తోపాటు ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రైవేట్ మెడికల్ షాప్‌లకు..

కుంటాల వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలనుకున్న రోగులకు ప్రతినిత్యం నిరాశ ఎదురవుతోంది. చిన్నపిల్లలు, పెద్దలకు సంబంధించిన దగ్గు, జలుబు, చర్మవ్యాధుల నొప్పులకు అవసరమైన మందులు ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. వైద్యశాలలో చూయించుకున్న అనంతరం రోగులు ఇక్కడ మందులు లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పీహెచ్‌సీ పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మందులు అందుబాటులో లేవు



అనారోగ్య బారినపడినప్పుడు వైద్యశాలకు వెళ్తే అవసరమైన మందులు అందుబాటులో లేవు. ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సిబ్బందిని కూడా నియమించాలి.

– న్యాలకంటి భూషణ్, కుంటాల

పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది



ఇంట్లో ఎవరైనా జబ్బుపడితే కుంటాలకు వెళ్లి వైద్యం చేయించుకునేలా లేదు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది.

– శ్యామల, విఠాపూర్

వృథాగా గోదాములు..!



భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో శిథిలావస్థకు చేరిన గోదాములు వృథాగా మారాయి. దాదాపు కొన్నేళ్లుగా వీటిని వినియోగించకపోవడంతో స్థానికులు చెత్తాచెదారం వేసేవారు. దీంతో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునేవి. కొన్నిరోజుల క్రితం కూడా అగ్నిప్రమాదం జరగడంతో మంటలార్పే క్రమంలో గోదాముకు ఉన్న రేకుల తలుపులు తొలగించారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. అయితే, వీటిని తొలగించి, దుకాణా సముదాయాలు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆదాయం సమకూరుతుందని పేర్కొంటున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.

నాలాలోనే విద్యుత్ స్తంభం



భైంసాటౌన్: పట్టణంలోని ఏపీ నగర్‌లో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. కొన్నేళ్లుగా కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీవాసులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో పనులు చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా..కొన్నిచోట్ల పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కాలనీలోని ఓ ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఉండగా, దానిని తొలగించకుండానే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడే అవకాశముంది. అలాగే, వర్షాకాలంలో స్తంభానికి విద్యుత్ సరఫరా అయితే, ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రమాద నివారణ చేపట్టాల్సిన అవసరముంది.

పరస్పర సహకారంతో అభివృద్ధి

- సామాజిక సేవల్లో భాగమవుదాం
- రెడ్డి మహిళల సమాఖ్య సమావేశం

నిర్మల్: రెడ్డి సామాజికవర్గానికి చెందిన మహిళలంతా పరస్పర స్నేహపూర్వకంగా ఉండాలని, సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలని, రెడ్డి మహిళల సమాఖ్య ఆర్గనైజర్ కేశపెల్లి ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏఎన్‌రెడ్డికాలనీ క్లబ్‌హౌస్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘటితంగా ఉంటూ సుస్థిర అభివృద్ధికి కృషిచేయాలన్నారు. మహిళా సాధికారతకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. సామాజిక సేవల్లోనూ పాలుపంచుకోవాలని చెప్పారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని, విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. జెడ్పీ మాజీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, అల్లోల వినోద, డాక్టర్ స్వర్ణారెడ్డి, విమల, సౌజన్య, శిరీష, సౌజన్య, గీత పాల్గొన్నారు.

రోడ్లున్నా.. బస్సు సౌకర్యం సున్నా



రాజూరా మార్గంలో బీటీ రోడ్డు ఇదే..



రాజూరా జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రైవేటు వాహనాలు, సైకిళ్లపై వచ్చే విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రోడ్లున్నా ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేదు. మండల కేంద్రం నుంచి సుమారు 20 కి.మీ దూరంలో ఉన్న రాజూరా, బావాపూర్(ఆర్), సింగాపూర్, చందునాయక్‌తండా, దేశినాయక్‌తండా పంచాయతీలకు వెళ్లేందుకు బీటీ రోడ్లున్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో బస్సు సౌకర్యం ఉన్నప్పటికి ఏడాదిగా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వివిధ గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్‌వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం వానాకాలం నేపథ్యంలో జ్వరం బారినపడి పట్టణానికి ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలు ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. సింగాపూర్, గొండుగూడ, నాయకపుగూడ, బావాపూర్(ఆర్) గ్రామాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు రాజూరా జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్నారు. కొందరు ప్రతీరోజు ప్రైవేటు వాహనాల్లో పాఠశాలకు వెళ్తున్నారు. సకాలంలో చేరకపోవడంతో 10 కి.మీ మేర సైకిళ్లపై పాఠశాలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఖానాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు చెట్టును ఢీకొన్న ఘటన అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు వాహనాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. మారుమూల అటవీప్రాంతాల్లోని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా పాలకులు, అధికారులు దృష్టిసారించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు దివ్యాంగశక్తి వార్షికోత్సవం

నిర్మల్: దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు దివ్యాంగులకు సహకరిస్తున్న వారిని సన్మానించడానికి ప్రతీఏడాది వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దివ్యాంగశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు పంచగుడి మహేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతోపాటు వివిధ రంగాలవారు పాల్గొంటారని చెప్పారు.



కుంటాల: గోరింటాకుతో విద్యార్థినులు

గోరింటాకు సంబరాలు



తానూరు: గోరింటాకు పెట్టుకున్న విద్యార్థినులు

కుంటాల/తానూరు: ఆషాఢమాసం సందర్భంగా కుంటాల మండలం కల్లూరు కేజీబీవీ, తానూరు మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలల్లో సోమవారం గోరింటాకు సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. తానూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సాయిబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న కూలీల కొరత



పంచగుడిలో వరి నాట్లు చేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

- ఊపందుకున్న వరినాట్లు
- ఇతర రాష్ట్రాలవారిపై ఆధారం
- పెరిగిన కూలి ధర
- ముందుగా అడ్వాన్సులు చెల్లిస్తున్న రైతులు

లోకేశ్వరం: ఖరీఫ్‌సీజన్‌లో వరి నాట్లు ఊపందుకున్నాయి. రైతులను పొలాల్లో బిజీబిజీగా ఉన్నారు. అయితే నాట్లు వేయడానికి కూలీల కొరత వేధిస్తోంది. అడపదడపా వర్షాలు కురవడంతో ప్రస్తుత సీజన్‌లో వరి విస్తీర్ణం పెరిగింది. రైతులు ఇతర పంటలకు బదులు వరి సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకం, బోరుబావుల వద్ద వీటి సాగు చేస్తున్నారు. రైతులందరూ ఒకేసారి నాట్లు వేయడంతో కూలీల కొరత అధికంగా ఉంది. డబ్బులు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదు. ముందుగా అడ్వాన్సు చెల్లించి వారం నుంచి పది రోజుల వరకు వారి కోసం వేచి చూస్తున్నారు. గత సంవత్సరం పోలిస్తే కూలీ రేట్లు పెరిగాయి. ఎకరాకు సుమారు 10 నుంచి 12 మంది ఆడ కూలీలు అవసరమవుతారు. ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 వరకు కూలి, మగ వారికి రూ.600 నుంచి 700 వరకు చెల్లిస్తున్నారు. కాగా, స్థానికంగా ఉన్న కూలీలు నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూర్, నాలేశ్వర్, ఉమ్మెడ, ఖాద్గుణ, అన్నారం, నందిపేట్, తల్వేద, ఆయిలాపూర్, కొత్తూర్, సీహెచ్‌రాజ్‌పల్లి గ్రామాలకు వెళ్తారు. అక్కడి నుంచి ఇక్కడి పనులకు వస్తుంటారు.

ఇతర రాష్ట్రాల కూలీలు

బిహార్, నల్గొండ, మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలకు చెందిన కూలీలతో కొన్నిచోట్ల నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం గడ్‌చాంద, పుస్పూర్ గ్రామంలో వారు వరినాట్లు వేయడానికి వచ్చారు. ఎకరాకు 12 మంది గ్రూప్‌గా ఏర్పడి రూ.5200లకు చొప్పున గుత్త నాట్లు వేస్తున్నారు. స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ అధికంగా ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలతో వరినాట్లు వేయించుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

కూలీలు దొరకడం లేదు



వరినాట్లు వేయడానికి స్థానికంగా కూలీల కొరత అధికంగా ఉంది. ఎక్కువ డబ్బులు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదు. పది రోజుల ముందు అడ్వాన్సులు చెల్లించి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నాట్లు ఆలస్యమయ్యేలా ఉంది.

– మగ్గిడి భోజారెడ్డి, పంచగుడి

ఇతర జిల్లా వారితో..



స్థానికంగా కూలీల కొరత ఉండడంతో జిల్లాలకు చెందిన కూలీలపై ఆధారపడుతున్నాం. తూకం వేసినప్పటి నుంచి నాట్లు వేసేవరకు అన్ని పనులు వారు చేసుకుంటున్నారు.

– ఎల్లయ్య, వట్టోలి

కోట శ్రీనివాసరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న కళాకారుల సంఘం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: సినీనటుడు కోట శ్రీనివాసరావు పలు విలక్షణ పాత్రలకు జీవం పోస్తూ తనదైన శైలిలో ప్రేక్షకులను మెప్పించారని జిల్లా చలన చిత్ర, టీవీ కళాకారుల సంఘం కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు 750 పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ సినీరంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని కొనియాడారు. చలన చిత్ర టీవీ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అనిల్, కార్యవర్గ సభ్యులు రాజన్న, కమలాకర్, నరసయ్య, రాజేందర్, మోహన్‌రావు, కృష్ణవర్మ, అహ్మద్‌ఖాన్, మేరీమాత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

- ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్

నిర్మల్ రూరల్: ముదిరాజ్ కులస్తులకు విద్య, ఉపాధిలో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమంలో మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు రాష్ట్ర జనాభాలో సుమారు 60 లక్షల మంది ఉన్నారని, వారంతా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరంతా సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ప్రత్యేకమైన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. హైకోర్టు సూచించిన విధంగా రాష్ట్రంలోని ప్రతీ చెరువులో 18 సంవత్సరాలు నిండిన ముదిరాజ్‌లకు సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకార సభ్యత్వాల విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు పోటీచేసి రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లకు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో పీఏసీఎస్ అధ్యక్షుడు బొండ్ల గంగాధర్, రాష్ట్ర నాయకులు నారాయణ, శివయ్య, బర్మా రాజనర్సయ్య, అనిల్, కిష్టయ్య, దర్శనం దేవేందర్, దినేష్, సంతోష్, ఉమామహేశ్వర్, శంకర్, గంగాధర్, రాజేశ్వర్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పరిధిలోని ఆయిల్‌పామ్ తోటలను ఖానాపూర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి స్పందన సోమవారం పరిశీలించారు. రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానపంటల సాగును ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల్లో భాగంగా రైతులు మామిడి, నిమ్మ, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి తోటల పెంపకానికి సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. కూరగాయల సాగుకు అందించే చేయూతను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.